సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సాధనతో ఉన్నత శిఖరాలకు..

నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య పేర్కొన్నారు. - 8లో



పదవి లేకున్నా.. ఉన్నట్లే

తనకు పదవి లేకున్నా.. ఉన్నట్లేనని. వయోభారంతో విశ్రాంతి తీసుకుంటున్నానని మాజీ మంత్రి జానారెడ్డి పేర్కొన్నారు. - 8లో



హామీల అమలులో విఫలం

హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి విమర్శించారు. - 9లో

న్యూస్‌రీల్

సెప్టెంబర్ నుంచి కొత్త కార్డులకు బియ్యం

సాక్షి యాదాద్రి : సెప్టెంబర్ నుంచి కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయనున్నారు. జిల్లాలో కొత్తగా 24,431 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరికి 621 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి. కొత్తవాటితో కలిపి రేషన్‌కార్డులు 91,262కి పెరిగాయి.ఇందులో 7,62,572 యూనిట్లు ఉన్నాయి. పాత, కొత్త కార్డుల యూనిట్లకు 4,836 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. బియ్యాన్ని గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం జూన్ ఒకేసారి పంపిణీ చేసిన విషయం తెలిసిందే.


సర్వాయి పాపన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు, కులసంఘాల ప్రతినిధులు

భువనగిరిటౌన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి, దళిత,బహుజన,మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించిన ఘనత సర్వాయి పాపన్నదని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌ఓ జయమ్మ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సాహితీ, అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీకి షోకాజ్ నోటీస్



కలెక్టర్ తనిఖీకి వచ్చిన సమయంలో పల్లె దవాఖానాకు తాళం వేసి ఉన్న దృశ్యం

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి పల్లె దవాఖాన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) డాక్టర్ అనూషకు అధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. సోమవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో దవాఖానను తనిఖీ చేయడానికి కలెక్టర్ వచ్చారు. ఆ సమయంలో ఆస్పత్రికి తాళం వేసి ఉంది. పైగా సిబ్బంది కూడా ఎవ్వరూ అందుబాటులో లేరు. ఎంఎల్‌హెచ్‌పీ సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు తెలియడంతో ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు

భువనగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు భువనగిరి స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 30వరకు అవకాశం ఉందన్నారు. వివరాల కోసం సెల్‌నంబర్ 9000590545ను సంప్రదించాలని కోరారు.



నిండుకుండలా గంధమల్ల

జిల్లాలోనే అతి పెద్దదైన గంధమల్ల చెరువు మత్తడి దుంకుతోంది. యాసంగి సీజన్‌కు సాగునీటికి సమస్య ఉండదని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎగువన ఉన్న జగ్‌దేవ్‌పూర్‌లో కురిసిన భారీ వర్షానికి ధర్మారం మీదుగా గంధమల్ల చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది. 0.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ చెరువు అలుగుపోస్తుండడంతో రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు వాగు పారుతోంది.



బొమ్మలరామారం మండలం బండకాడిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శామీర్‌పేట వాగు



బేగంపేట చెరువులోకి చేరుతున్న వరద నీరు

వాన జోరు.. వరద హోరు

జిల్లాను ముంచెత్తిన వర్షం.. గుండాలలో 16 సెం.మీ వర్షపాతం నమోదు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలుచోట్ల కోతకు గురైన రోడ్లు, చెరువులు, కుంటలకు గండ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- లో లెవల్ వంతెనల పైనుంచి వరద నీరు.. రాకపోకలకు ఇక్కట్లు
- వెల్వర్తి వద్ద యువకుడు గల్లంతు
- అప్రమత్తమైన యంత్రాంగం

సాక్షి, యాదాద్రి : వారం రోజులుగా కురుస్తున్న ముసురు వానలకు తోడు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి రికార్డ్ స్థాయిలో కురిసిన వర్షానికి చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. మొన్నటి వరకు చుక్కనీరు లేని శామీర్‌పేట, చిన్నేరు వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. బిక్కేరుకు వరద పోటెత్తింది. మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఐదు మండలాల్లో 10 సెంటీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 80 మి.మీ కాగా.. 18వ తేదీ నాటికి 326 మీ.మీ వర్షపాతం నమోదైంది.అదనంగా 246 మీ.మీ వర్షం కురిసింది.

ఐదు మండలాల్లో ఈ సీజన్‌లోనే అధికం

- వర్షానికి మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బృందావన్ కాలువ వరదతో మోత్కూరు పెద్ద చెరువు నిండి అలుగుపోస్తుంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నార్కట్‌పల్లి రోడ్డులో ఉన్న ఓ భవనం అండర్‌గ్రౌండ్‌లోకి మోకాలు లోతు నీరు చేరింది. ఇందిరానగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో భారీగా వరద నీరు చేరడంతో సెలవు ప్రకటించారు.
- గుండాల మండలంలో 16 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో అతిపెద్ద వర్షం కావడంతో మండలంలో చెరవులు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. మండల పరిధిలో బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తుర్కలషాపురం, గుండాల, రామారం,గంగాపురం, మాసాన్‌పల్లి ఊర చెరువులు అలుగు పోస్తున్నాయి. గుండాల కొత్తకుంటకు గండి పడింది.
- అడ్డగూడూరు మండలం కోటమర్తి, ధర్మారం చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. నక్కల వాగు లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. కోటమర్తి శివారులో బిక్కేరు వాగు ఉధృతంగా పారుతోంది.
- ఆత్మకూర్ (ఎం) మండలంలోని రాపాక, ఆత్మకూర్, కప్రాయపల్లి, రహీంఖాన్‌పేట, రాయిపల్లి చెరువుల్లోకి నీరు భారీగా చేరుతోంది. చాడ నుంచి మోదుగుబాయిగూడెం వరకు బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లో లెవల్ కాజ్‌వేల పైనుంచి నీరు పారుతోంది.
- యాదగిరిగుట్ట మండలం చొల్లేరు -మల్లిగూడెం మధ్యన గల వాగుపై ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలను నిలిపివేశారు. చొల్లేరు గ్రామ ప్రజలు లోలెవల్ వంతెన దాటలేక ఏడు కిలో మీటర్లు చుట్టూతిరిగి ప్రయాణిస్తున్నారు.



వడపర్తి కత్వ వద్ద షెట్టర్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



బీబీనగర్ మండలం గూడూరు - అన్నంపట్ల మధ్య మూసీకి అడ్డంగా కంప వేస్తున్న వ్యక్తి



గుండాల మండల కేంద్రంలో కొత్తకుంట కట్టకు గండి పడిన దృశ్యం

సాధారణం కంటే అధికం..

జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సగటున 78.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా గుండాల మండలంలో 16 సెం.మీ, మోత్కూరు 118.6 సెం.మీ, అడ్డగూడూరులో 120.4 సెం.మీ, బొమ్మలరామారంలో 116.4 సెం.మీ, తుర్కపల్లిలో 121.4 సెం.మీ రికార్డు స్థాయి వర్షం కురిసింది. అత్యల్పంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలో 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మొత్తంగా జూలై 1నుంచి ఆగస్టు నెల వరకు సాధారణ వర్షపాతం 312.2 మి.మీ కాగా.. 18వ తేదీ నాటికి 553.1 మి.మీ వర్షం కురిసింది. సాధారణం కంటే 240.9 మి.మీ వర్షపాతం అధికంగా నమోదైంది.

యువకుడు గల్లంతు

మోత్కూరు: వలిగొండ మండలం వెల్వర్తి శివారులో చెరువు అలుగు వరద నీటిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి నవీన్ సోమవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. చెరువు అలుగునీటిలో చేపలు పడుతున్న సమయంలో వరద ఉధృతి పెరగడంతో నవీన్ గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. వలిగొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

అలుగుపోస్తున్న 119 చెరువులు

జిల్లాలో 1,155 చెరువులు ఉన్నాయి. సోమవారం సాయంత్రానికి 119 చెరువులు అలుగులు పోస్తున్నాయి. 153 చెరువులు అలుగు పోయడానికి సిద్ధంగా ఉన్నాయి. 179 చెరువులు 75 శాతం, 234 చెరువులు 50 శాతం, 470 చెరువులు 25 శాతం వరకు నిండాయి. ఇందులో వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 159 ఉండగా అందులో అలుగులు పోస్తున్నచెరువులు 40 వరకు ఉన్నాయి.

భువనగిరి, బీబీనగర్ చెరువుల్లోకి నీటి విడుదల

మొన్నటి వరకు చుక్క నీరు లేని శామీర్‌పేట వాగు పరవళ్లు తొక్కుతోంది. ఈ వాగునుంచి భువనగిరి, బీబీనగర్ పెద్ద చెరువుల్లోకి నీరు చేరే కత్వ వద్ద షెట్టర్ల గేట్‌లు ఎత్తారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి గంగమ్మకు పూజలు చేసిన కత్వ షెట్టర్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. కాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉద్దెమర్రి, మూడుచింతలపల్లి గ్రామాల నుంచి వస్తున్న వరద ఉధృతితో బొమ్మలరామారం మండలం తిమ్మప్ప చెరువు, ప్యారారం, సోలిపేట చెరువులు అలుగుపోస్తున్నాయి. కంచల్‌తండాకు వెళ్లే లింకు రోడ్డు తెగిపోయింది.బండకాడిపెల్లి చెక్‌డ్యాం వద్ద వరద ఉధృతి అధికంగా ఉంది. భువనగిరి, బీబీనగర్ మండలాల్లో చిన్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.లో లెవల్ కాజ్‌వేల వద్ద రాకపోకలు నిలిపివేశారు.



బీబీనగర్ వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం వేకువజాము వరకు (మి.మీ)

గుండాల	160.8	ఆలేరు	33.2
ఆత్మకూర్	14.0	వలిగొండ	74.6
తుర్కపల్లి	121.4	రామన్నపేట	29.2
అడ్డగూడూరు	120.4	నారాయణపురం	20.8
మోత్కూరు	118.6	పోచంపల్లి	24.8
బి.రామారం	116.4	చౌటుప్పల్	30.6
యాదగిరిగుట్ట	91.2	రాజాపేట	42.0
భువనగిరి	87.8	మోటకొండూరు	60.8
బీబీనగర్	60.8	సగటున	78.4



భువనగిరి మండలం వడపర్తి కత్వ వద్ద వరద ఉధృతి



అలుగుపోస్తున్న మోటకొండూరు పెద్ద చెరువు



చొల్లేరు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజావాణి అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ హనుమంతరావు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

భువనగిరిటౌన్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, అధికారులతో కలిపి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పరిష్కారానికి సాధ్యం కానివి ఉంటే వెంటనే దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివిధ సమస్యలపై 36 అర్జీలు రాగా అందులో 23 వినతులు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి ఉన్నట్లు వెల్లడించారు.

- చీమలకొండూరు పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామానికి చెందిన నల్లమాస బాలరాజు కోరారు.
- చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో మసీదు స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ముస్లింలు విన్నవించారు.
- బీబీనగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.
- సమగ్ర సర్వేలో పాల్గొన్న డేట ఎంట్రీ ఆపరేటర్ల రెమ్యునరేషన్ ఇప్పించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ల ప్రతినిధులు కోట నగేష్, విజయ్‌కుమార్ కలెక్టర్‌కు విన్నవించారు. డేటా ఎంట్రీ ముగిసి 8 నెలలు కావస్తుందన్నారు. కాగా వారంలోగా ఆపరేటర్ల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

భద్రత లేదు.. భరోసా కరువు!

మిస్టరీగా దొంగతనం కేసులు

- నెలలు గడిచినా దర్యాప్తులో కనిపించని పురోగతి
- బాధితులకు జరగని న్యాయం
- ఆలేరు స్టేషన్ పరిధిలో జనవరి నుంచి నమోదైన వివిధ కేసులు 94

జనవరి నుంచి ఆగస్టు వరకు నమోదైన కేసులు

దొంగతనాలు	17	రియల్ ఎస్టేట్	08
సైబర్ నేరాలు	05	మిస్సింగ్	14
చీటింగ్ కేసులు	02	గుట్కా	03
హత్యాయత్నాలు	02	బెల్టుషాపులు	12
ఘర్షణలు	15	ఆత్మహత్య	06
భూవివాదాలు	06	హత్యలు	01
		కల్తీ ఆహారం	03



ఆలేరు: జనవరిలో ఆలేరులోని బీసీ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. రెండు తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు తస్కరించారు.

- ఫిబ్రవరిలో శారాజీపేటలో ఇంటి తాళం పగులకొట్టి మూడు తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు.
- ఏప్రిల్ 25న ఆలేరులోని నగల షాపులో చోరీ జరిగింది. కిలోన్నర వెండి, 5 గ్రాముల బంగారు వస్తువులు అపహరించుకెళ్లారు. మహారాష్ట్రంలోని పూణేకు చెందిన దొంగల ముఠా బైక్‌లపై వచ్చి చోరీకి పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నాలుగు నెలలు కావొస్తున్నా కేసు పురోగతి లేదు.
- జూన్‌లో ఆలేరు పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇంటి తాళం పగులగొట్టి 7.5 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని ఎత్తుకెళ్లారు.

ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. చోరీల నియంత్రణ, వివిధ కేసుల దర్యాప్తులో పోలీసులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని, దీంతో సొమ్ము రికవరీలో జాప్యం ఏర్పడి బాధిత కుటుంబాలకు న్యాయం జరగడం లేదన్న విమర్శలున్నాయి.

దర్యాప్తులో జాప్యం

ఏదైనా నేరం జరిగినప్పుడు పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని సందర్శించి కేసులు నమోదు చేస్తున్నా.. దర్యాప్తులో జాప్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో రాచకొండ పోలీసులకు మంచి ట్రాక్ రికార్డ్ ఉన్నా ఆలేరు పరిధిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కేసుల దర్యాప్తులో జరుగుతున్న జాప్యంతో సొమ్ము రికవరీ కాక బాధితులు నష్టపోతున్నారు.

గస్తీకి సుస్తీ..?

ఆలేరు పట్టణం మీదుగా వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి, రైలుమార్గం ఉంది. ఆలేరులో పలు రైళ్లకు హాల్టింగ్ ఉంది. రాత్రి వేళ గస్తీ సక్రమంగా లేకపోవడం వల్ల చోరీలకు పాల్పడిన దుండగులు బైపాస్ నుంచి, రైళ్ల ద్వారా సులువుగా పారిపోతున్నట్టు వాదనలున్నాయి. అదే విధంగా ఠాణాకు సమీపంలోనే పలు కేసుల్లో సెటిల్‌మెంట్ వ్యవహారాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లూ వదలడం లేదు

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం వదలడం లేదు. వ్యవసాయ బోరు మోటార్లు, పంపు సెట్లకు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, లక్షల రూపాయలు విలువ చేసే రాగి తీగ ఎత్తుకెళ్తున్నారు. ఆలేరు విద్యుత్ డివిజన్ పరిధిలో గొలనుకొండ, ఆలేరు, కొలనుపాక, మందనపల్లి, ఆత్మకూర్(ఎం), యాదగిరిగుట్ట, మోటకొండూర్, రాజాపేట గ్రామాల పరిధిలో పొలాల వద్ద నుంచి 16, 25 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 20 వరకు చోరీకి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ.20లక్షల వరకు ఉంటుంది. పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు.

నిఘా పెంచుతాం

దొంగతనాల నియంత్రణకు నిఘా పెంచుతాం. ముఖ్యంగా బైపాస్ మార్గంలో పెట్రోలింగ్‌ను మరింత పకడ్బందీగా చేస్తాం. చోరీలతోపాటు వివిధ కేసుల దర్యాప్తు కొనసాగుతోంది. నేర పరిశోధనలో కీలకమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు, వ్యాపారులకు సూచిస్తున్నాం.

–వినయ్, ఎస్‌ఐ ఆలేరు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, నాయకులు

భువనగిరిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరు రమాకుమారి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల కేంద్రాలు తెరిచేవారు లేక మూతపడుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్య అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలన్నారు. ఐసీడీఎస్‌కు ఏటా కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం కోత పెడుతూ నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధంలేని బీఎల్‌ఓ, ఇతర పనులను రద్దు చేయాలని, రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపాలని, ఫేస్ క్యాప్చర్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరు రమాకుమారి, గంగుల రమ, సరిత, విజయలక్ష్మి, కల్యాణి , రమ , భూలక్ష్మి ,వినోద, సాహెదా, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైన్స్ కాంగ్రెస్‌కు ఎంజీయూ విద్యార్థుల ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పీజీ(బోటనీ) చదువుతున్న విద్యార్థులు వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్–2025లో 'ఎవల్యూషన్ ఆఫ్ యాంటీ మైక్రోబియల్ పొటెన్షియల్ ఆఫ్ బ్లాక్ టర్మరిక్ రైసోమ్ ఎక్స్‌ట్రాక్ట్' అనే అంశంపై చేసిన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు అధ్యాపకురాలు శ్రావ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టు లో భాగంగా ఎన్నుకున్న పరిశోధన పత్రాన్ని సైన్స్ కాంగ్రెస్‌లో సమర్పణకు ఎంపిక కావడం గర్వకారణమని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పరిశోధనలో భాగస్వాములైన విద్యార్థులు సాంబశివరావు, మౌనిక, గీత, నవనీత, త్రివేణి, స్వప్న, రవళికను అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రేమ్‌సాగర్ అభినందించారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీల పట్టివేత

నాగార్జునసాగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న 18 లారీలను నాగార్జునసాగర్‌లో సోమవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన లారీల్లో కొన్నింటిని హిల్‌కాలనీలోని బుద్ధవనం ముందు గల సిద్దార్థ హోటల్ వద్ద, మరికొన్నింటిని మరో చోట ఉంచారు. నల్లగొండ జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు పోలీసులు సమాచారమివ్వడంతో వారు సాయంత్రానికి సాగర్ చేరుకుని, లారీల డ్రైవర్ల వద్ద గల అనుమతి పత్రాలను చూసి విచారణ చేపట్టారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ అధికారి జాకోబ్‌ను వివరణ కోరగా.. తమ కార్యాలయ సిబ్బందిని నాగార్జునసాగర్‌కు పంపించామని, వారు విచారణ చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఉదయానికి వాటి లెక్కలు తేలుతాయని వివరించారు.

వ్యక్తి అదృశ్యం


సట్టు శ్రీను

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణానికి చెందిన సట్టు శ్రీను ఈ నెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు సోమవారం నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. శ్రీనుకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు శ్రీను తెల్ల రంగు చొక్కా, నీలి రంగు లుంగి ధరించాడని, ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీను ఆచూకీ తెలిసినవారు 87126 86054, 87126 86012 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

యాదగిరిగుట్ట రూరల్: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకందుకూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు నల్లమాస శంకరయ్య(58) రోజుమాదిరిగానే సోమవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకు జారడంతో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. శంకరయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఎక్కువ ఆయకట్టుకు నీరందించేందుకు కృషి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


నీటిపారుదల శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో రూ.7.99 కోట్లతో నిర్మించనున్న నీటిపారుదల శాఖ సమీకృత డివిజన్ కార్యాలయం–3 భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అతి తక్కువ ఖర్చుతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించి ఎక్కువ ఆయకట్టుకి సాగు నీరు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ శాఖలో సంస్కరణలు తెచ్చామని, ఇందులో భాగంగా 1,100మంది ఏఈలు, 1,800 మంది లష్కర్లను నియమించినట్లు చెప్పారు. నీటిపారుదల డివిజన్ పునర్వ్యవస్థీకరణ సమయంలో డివిజన్ నంబర్– 3 పరిధిలో ఉన్న ఇరిగేషన్ సబ్ డివిజన్ నంబర్ 2, 3, 4 కార్యాలయాలు కలిపి హుజూర్‌నగర్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కోదాడ నియోజకవర్గ పరిధిలోని 2,29,961 ఎకరాలు, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 1,50,181 ఎకరాల ఆయకట్టుతో కూడిన నాగార్జునసాగర్ గ్రావిటీ కాలువలు, ఎత్తిపోతల పథకాల నీటిపారుదల సౌకర్యాలను ఈ కార్యాలయం చూసుకుంటుందని తెలిపారు. ఆరు నెలల్లో ఈ కార్యాలయం నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగభూషణ్‌రావు, ఈఈలు రామకిషోర్, సత్యనారాయణ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ వైరు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.2.75 లక్షల నగదు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ నరసింహ


నిందితులను చూపుతున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు

సూర్యాపేటటౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ల వద్ద ఫ్రీక్వెన్సీ కేబుల్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జూన్‌లో నడిగూడెం, మునగాల పోలీస్ స్టేషన్ల పరిధిలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్లకు సంబంధించి ఫ్రీక్వెన్సీ కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం మునగాల పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ఆకుపాముల గ్రామం వెళ్లగా.. అక్కడ బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కారులో ఉండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం రాజాపూరం గ్రామానికి చెందిన మహంకాళి శ్రీనాథ్, బుడుపుల వంశీకృష్ణగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు నిందితులతో పాటు కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన చలిగంటి శ్రావణ్‌కుమార్ కలిసి సుమారు నాలుగు నెలల కాలంలో తొమ్మిది బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్లలో కట్టర్, హ్యాక్‌సా బ్లేడ్ ఉపయోగించి కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. దొంగతనం చేసిన కేబుల్ వైర్లను కాల్చి దాని నుంచి కాపర్ వైరును తీసి బస్తాల్లో వేసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లి జీడిమెట్ల, పటాన్‌చెరు ఏరియాల్లో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులు పంచుకుని జల్సాలు చేసేవారని ఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల కేబుల్ వైరు, కారు, కట్టర్, హ్యాక్‌సా బ్లేడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రావణ్‌కుమార్‌కు గతంలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్లలో పనిచేసిన అనుభవం ఉందని, అతడిపై 4 దొంగతనం కేసులు ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు. శ్రీనాథ్, వంశీకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. శ్రావణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. ఈ విలేకరుల సమావేశంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరి రిమాండ్


మల్లికార్జున్


కిరణ్

భూదాన్‌పోచంపల్లి: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరిని సోమవారం పోచంపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎస్. లింగోటం గ్రామానికి చెందిన కందగట్ల కిరణ్, చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన పస్తం మల్లికార్జున్ స్నేహితులు. వారిద్దరు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలోని హెజిలో కంపెనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పలువురు కార్మికులు పనిచేస్తూ గ్రామ శివారులో అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 15న రాత్రి తలుపులు పెట్టుకోకుండా నిద్రించడాన్ని గమనించిన కిరణ్, మల్లికార్జున్ గుట్టుచప్పుడు కాకుండా వెళ్లి 6 సెల్‌ఫోన్లు అపహరించి పరారయ్యారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అంతమ్మగూడెం ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నంబర్‌ప్లేట్ లేని స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తున్న కిరణ్, మల్లికార్జున్ పట్టుకొని విచారించారు. వారు సెల్‌ఫోన్లు చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్కూటీని సీజ్ చేశారు. అనంతరం చౌటుప్పల్ కోర్టులో రిమాండ్ చేయగా, మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు నల్లగొండ జైలుకు తరలించారు. కిరణ్, మల్లికార్జున్‌పై గతంలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో 20కి పైగా చోరీ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఇటీవల చౌటుప్పల్‌లో ఓ వాహనాన్ని కూడా దొంగిలించారని ఎస్‌ఐ తెలిపారు.

- హైవేపై వాహనాల బారులు



చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ పెరిగింది. ఈనెల 15 నుంచి వరుసగా సెలవులు రావడంతో పాటు ఆదివారం చాలా గ్రామాల్లో బోనాల పండుగ ఉండడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు సోమవారం తిరుగుపయనమయ్యారు. దీంతో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం

భువనగిరిటౌన్ : రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సర్వేష్ అనేమియా సర్కార్ భువనగిరి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం సుమారు రెండు గంటల పాటు అతడిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా.. గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 15 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

- క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స
- సకాలంలో ఆస్పత్రికి తరలింపు


ఘటనా స్థలంలో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న ఆలేరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు

ఆలేరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటారు ఆలేరు పోలీసులు. ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పేట సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఇక్కుర్తి గ్రామానికి చెందిన వంగాల మధుసూదన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తూ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో బహదూర్‌పేటలో ఎమ్మెల్యే కార్యక్రమానికి బందోబస్తులో పాల్గొని తిరిగి ఆలేరు పోలీస్ స్టేషన్‌కు వస్తున్న కానిస్టేబుళ్లు సైదులు, ప్రసాద్, నవీన్, అశోక్ రోడ్డు పక్కన గాయాలతో ఉన్న మధుసూదన్‌రెడ్డిని చూశారు. వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108 వాహనానికి ఫోన్ చేసి, ఆస్పత్రికి సకాలంలో తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త


సుజాత (ఫైల్)

రాజాపేట: కుటుంబ కలహాలతో భార్య గొంతు నులిమి భర్త హత్య చేశాడు. ఈ ఘటన రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామంలో జరిగింది. సోమవారం ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టగూడెం గ్రామానికి చెందిన ముడావత్ అమ్మకు అదే గ్రామానికి చెందిన సుజాతతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. వీరు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తుల మధ్య పంచాయితీ పెట్టి మాట్లాడుకున్నారు. కాగా ఆదివారం రాత్రి సుజాత(35) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామస్తులు గమనించి సుజాత తల్లి పింప్లికి సమాచారం ఇచ్చారు. సుజాత తల్లి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శంకర్‌గౌడ్ క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించారు. భర్త అమ్మనే సుజాత గొంతుకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి చంపినట్లు గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డిండికి 13,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

డిండి: ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టు అలుగుపోస్తోంది. ప్రాజెక్టులోకి వరద ప్రవాహం సోమవారం మళ్లీ పెరిగింది. దీంతో దుందుబి వాగు ద్వారా ప్రస్తుతం ప్రాజెక్టులోకి 13,200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.


అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు

10 గేట్ల ద్వారా నీటి విడుదల


పులిచింతల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు నీటి మట్టం సోమవారం రాత్రి వరకు పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,55,668 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 10 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,10,060 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నాకు పదవి లేకున్నా.. ఉన్నట్లే

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


వెల్మగూడెంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దవూర: తనకు పదవి లేకున్నా.. ఉన్నట్లేనని, వయోభారంతో విశ్రాంతి తీసుకుంటున్నానని, తన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తన కుమారులతో కలిసి అభివృద్ధిలో భాగస్వాముడిని అవుతానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దవూర మండలం గర్నెకుంట, వెల్మగూడెం గ్రామాల్లో మాజీ సర్పంచ్ దాచిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎస్ రెడ్డి (దాచిరెడ్డి వెంకట నర్సింహారెడ్డి) సోదరులు రూ.12లక్షల సొంత ఖర్చులతో నిర్మించిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌లను సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. సొంత నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలకు అప్పగించడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాధవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. రెండేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని, ఇళ్లు రాలేదని ఎవరూ బాధపడవద్దని సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధచూపుతూ నాకంటే ఎక్కువ మన్ననలు పొందాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి సూచించారు. వారంలో రెండు రోజులు మద్యం తాగడం బంద్ చేసి ఆ డబ్బులతో హెల్త్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని తనతో పాటు డీవీఎస్ రెడ్డి కూడా కొంత సహాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అబ్బిడి కృష్ణారెడ్డి, బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ధర్మారెడ్డి, బోయ నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, రామలింగయ్య, నాగరాజు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రమించే విద్యార్థులకే ఉపాధి అవకాశాలు

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి శ్రమించే విద్యార్థులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇంజనీరింగ్ కోర్సుల విధివిధానాలు, ప్లేస్‌మెంట్ సెల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెల్, ఇన్‌స్టిట్యూట్ ఇండస్ట్రీ కనెక్ట్, స్టూడెంట్ వెల్ఫేర్ విభాగాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు 75 శాతం హాజరు పాటిస్తూ విశ్వవిద్యాలయం అందించే కరిక్యులం, నైపుణ్యాల పెంపునకు ఏర్పాటు చేసిన సదుపాయాలు ఉపయోగించుకోవాలని సూచించారు. టెక్నాలజీని లక్ష్యసాధనకు వినియోగించి వ్యసనాల బారిన పడకుండా యువత దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్. సుధారాణి, అధ్యాపకులు రేఖ, ఎం. జయంతి, టి. మౌనిక, అవినాష్, హరీష్ కుమార్, విజయ్‌కుమార్, రామచంద్రుడు, డైరెక్టర్లు వై. ప్రశాంతి, శ్రీదేవి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలకు..


మాట్లాడుతున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల విద్యార్థులు

- విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి: నిరంతర సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని చెప్పారు. 75శాతం మంది విద్యార్థులకు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ వందశాతం ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు. చదువుతో పాటు విద్యార్థుల్లో సామాజిక దృక్పథం, మనోవికాసం, సేవా కార్యక్రమాలు, టీమ్ స్పిరిట్ పెంచడానికి తరచూ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ ఐఏఎస్ అధికారిణి, యూనివర్సిటీ అడ్వైజర్ డాక్టర్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టనష్టాలు, ఒడిదొడుకులు అన్నింటిని ఎదుర్కొన్నప్పుడే వారు మానసిక పరిపూర్ణత సాధిస్తారని అన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వీఎంవీ రావు మాట్లాడుతూ.. పట్టుదలను పెట్టుబడిగా పెడితే లక్ష్యసాధన సులభతరం అవుతుందని అన్నారు. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉపాధి రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాజాపై దాడులు విరమించుకోవాలి


నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్దకు ర్యాలీగా వచ్చిన ముస్లింలు

- నల్లగొండ పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించిన ముస్లింలు

రామగిరి(నల్లగొండ): పాలస్తీనాలోని గాజా నగరంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను విరమించుకోవాలని ముస్లిం సంఘాల నేతలు కోరారు. గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ ముస్లిం మతపెద్దలు మౌలానా సయ్యద్ ఎహసానుద్దీన్, మౌలానా యాసర్ హుస్సేన్, మౌలానా ముఫ్తీ సిద్దీఖ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. సేవ్ గాజా అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా క్లాక్‌టవర్ సెంటర్‌లో పలువురు మాట్లాడుతూ.. గాజా ప్రజలపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. యుద్ధం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హఫీజ్‌ఖాన్, అహ్మద్ కలీం, సామాజిక కార్యకర్త పి. దేవి, నాగార్జున, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సేవ్ గాజా అనే అక్షరాలను ప్రదర్శిస్తున్న ముస్లింలు


నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేస్తున్న ముస్లింలు